("యువ" మాసపత్రిక: దీపావళి 1977)

మృగతృష్ణ

"వాల్తేరులో ఉద్యోగమాండీ?"

గీత తలతిప్పి అతనివేపు చూసింది.

ముప్ఫయ్యేళ్ళుంటాయి అతనికి. తెల్లటి ఫుల్‌హాండ్స్ టెర్లిన్‌షర్టు. నీలం రంగు స్ట్రెచ్‌లాన్ బెల్‌బాటమ్‌లో టక్ చేసుకున్నాడు. కళ్ళతో పెదవులతో అందంగా నవ్వుతున్నాడు.

"అవునండీ." అని చెప్పేసి ఎందుకు చెప్పానా అని తను ఈ సంభాషణ కిచ్చిన అవకాశానికి పశ్చాత్తాప పడుతూనే, నేను వాల్తేరు వెళుతున్నానని యితనికి ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపడ్డది.

"నేనూ వాల్తేరే వెళ్తున్నాను" అని తిరుగు బాణంలా చెప్పి అతను పాంటు చివర అంటీఅంటనట్టున్న దుమ్ముని రెండు వేళ్ళతో దులుపుతున్నాడు.

'అలాగా' అనుకుని వూరుకుంది గీత. మాటకి మాట తెగులు. ఊరుకున్నంత ఉత్తమంలేదు.

"నేను మెడికల్ రిప్రజెంటెటివుగా పనిచేస్తున్నాను. మా కంపెనీకి విశాఖపట్నంలో ఎవరూ లేరు. బెజవాడలో వుంటూ ఆరు జిల్లాల పనిచూస్తున్నాను" అన్నాడతను.

గీత అతనివేపు చూసి ఊరుకుంది.

"నా పేరు సరోజ్ కుమార్."

"...... ......"

"మీ పేరేంటో తెలుసుకోవచ్చా?"

"గీత. నేను యూనివర్శిటీలో క్లర్క్‌గా వున్నాను— వర్కింగ్‌వుమెన్స్ హాస్టల్లో వుంటున్నాను. నైట్ కాలేజీలో బీ.కామ్. చదువుతున్నాను"

"మిమ్మల్ని తెలుసుకుంటున్నందుకు సంతోషంగా వుంది" అని రెండు చేతులూ జోడించాడతను.

గీత అప్రయత్నంగా నమస్కారం చేసింది.

సన్నటి, పొడుగాటి వేళ్ళుగల ఆ అరచేతులవేపు, నాలుగు బంగారు గాజులు ఒకదానికి, నల్లస్ట్రాప్‌తో రోల్డ్‌గోల్డ్ స్క్వేర్ వాచి ఒకదానికిగల ఆమె ముంజేతులవేపు పరీక్షగా చూసి మళ్ళీ చిరునవ్వు నవ్వాడు సరోజ్‌కుమార్.

"మీలాంటి వాళ్ళు ఆ. బి. కామ్. కూడా పూర్తి చేస్తే, అనుభవం వుంది కనుక ఏ బ్యాంక్ వాళ్ళైనా తీసుకుంటారు."

"థ్యాంక్స్."

"మీరు సికింద్రాబాదులో యెక్కారు. మిమ్మల్ని చూడగానే యెందుకో పరిచయం చేసుకోవాలనిపించింది. కండక్టర్ చెప్పాడు, మీరు వాల్తేరు వెడుతున్నారని."

తొలిచూపులోనే నా గురించి భోగొట్టా చేయాలని కోరిక కలిగిందన్న మాట— అనుకుని హేళన అతనిమీద, ఆనందం తనమీద కలిగి రెండు నవ్వులు ఒకటిగా పోసుకుని అతనివేపు చూసింది గీత.

"మిమ్మల్నడుగుతే మీరే చెప్తారనుకోండి" అని కొంచెం ఆగి, "అయినా ఎందుకో, మీరేమనుకుంటారో అని భయంవేసి అడగలేదు" అన్నాడు.

గీత మాట్లాడలేదు. అతన్ని క్రీగంట చూసింది.

సికింద్రాబాదు స్టేషన్లో రైలు ఎక్కగానే తన బెర్తేదో వెతుక్కుని, దానిమీద సూట్ కేసు పెట్టి, అందులోంచి దుప్పటి తీసి, సూట్ కేసు ఓ పక్కగా లాగి, బెర్తంతా దుప్పటి పరచి, పైకెక్కి, తలకింద సూట్ కేసు అమర్చుకుని వెల్లకిలా పడుకుని, కాలక్షేపానికి తెచ్చుకున్న పత్రిక చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పసాగింది గీత.

అది టూ- టయర్ రిజర్వేషన్ కంపార్టుమెంటు. కింద సీటుమీద నలుగురు కూచున్నారు. అందులో ముగ్గురు ఒకరికొకరు తెలిసున్నవారని, వారి కబుర్లవల్ల, ఒకే పెట్టెలోంచితీసి ఒకే అగ్గిపుల్లతో అంటించిన సిగరెట్లద్వారా తెలుసుకుంది గీత. సిగరెట్ల పొగ సరాసరి పైకి వస్తుంటే అంతవరకు నిశ్శబ్దంగా వున్నఫ్యాన్ ఆన్‌చేసి పొగపోతుందేమోనని ప్రయత్నించింది. అంతగా ఫలించలేదు.

సికింద్రాబాదువదిలి పదిహేను మైళ్ళు వచ్చేసరికి ఏకారణంవల్లో రైలు ఆగింది. అప్పటిదాకా ఆమె, తన కెదర బెర్తులో ఎవరున్నారో చూడనేలేదు. అప్పుడైనా, అతను పక్కపరచుకునే ధోరణిలో హోల్డాల్ విప్పి బట్టలు దులు

పుతూ చేసిన చప్పుడుకి హడావిడికి అటు తిరిగి చూసింది. మొదటి చూపులోనే అతను ఇంతవరకు తననే గమనిస్తున్నాడని ఆమెకి అర్థమయిపోయింది.

చూడకండా ఎలా ఆపాలి?

నలుగుర్లోకీ వస్తే చూస్తారు, తప్పదు.

ఆఫీసులో పనిచేస్తున్నప్పుడు కూడా, ఎవరి పన్లు వాళ్ళు చేసుకుంటున్నట్టే వుంటారు. తనెప్పుడు ఎటుచూపినా అక్కడి వ్యక్తి సూటిగా తన కళ్ళలోకి చూస్తూ కనబడతాడు. ఆ చూపులో అతనింతసేపూ తన చూపుకోసం ఎంతగా నిరీక్షిస్తున్నాడో తెలియజేసేది ఒక సందేశం వుంటుంది.

మాట కలుపుతారు. పుస్తకాలు అందిస్తారు. కాఫీలకి రమ్మని అహ్వానిస్తారు. వీళ్ళందరినీ స్నేహితులుగా, సహృదయులుగా తీసుకోక తప్పదు ఒంటరిగా చిక్కి, కాఫీదాకా వెళితే సినిమాకి, సినిమాదాకా వెళితే మరోచోటికి, అలా అలా తీసుకుపోతారు. డబ్బు సరిపోతోందో లేదో భోగట్టాలు చేస్తారు. ఇంటికి పంపడం, కాలేజీ ఫీజు, హాస్టల్ ఫీజు, పుస్తకాలు, చీరలు, కాస్మెటిక్స్, సినిమాలు, లంచ్టైము ఖర్చులు, అన్నీ తెలిసినట్టు వివరించి సరిపోతుందని తను అంటున్నా సరిపోదని రుజువు చేస్తారు. పాపం అని ఫీలైపోతారు. మరికొంత బాగా జీవించాలని ప్రబోధిస్తారు. అందులో యెక్కడో వోచోట అతిచాకచక్యంగా బైటపెడతారు అసలు సంగతి.

డబ్బు ఆశపెడతారు. కాలు జారడానికి యెంత పుచ్చుకోవచ్చు? అని మనసులో చిరునవ్వుతో ఆలోచించుకుంటూ మౌనంగా వూరుకుంటే వాళ్ళంతట వాళ్ళే రేటు పెంచుకుంటూ పోతారు.

ఆ మధ్య వొక జోకు చదివింది. ఒక రోమియో ఒకమ్మాయితో "లక్ష రూపాయ లిస్తాను; నాతో వ్యభిచరిస్తావా?" అంటాడు. అమ్మాయి సరే నంటుంది. వెంటనే అతను, "పది రూపాయలిస్తాను, నా దగ్గిర పడుకుంటావా?" అని అడుగుతాడు. ఆ అమ్మాయి కోపం తెచ్చుకుని "ఎవరనుకుంటున్నావు నీ మనసులోకి" అని దబాయిస్తుంది. దానికా అబ్బాయి, "ఆ సంగతి ఇంతకుముందే తేలిపోయింది. ప్రస్తుతం రేటు గురించి బేరం సాగుతోందంతే"అంటాడు.

అంత దయావిహీనంగా వుంటుంది కాబోలు మగదృష్టి.

పెళ్ళయిన వాళ్ళు వుంటారు. పిల్లలు గల వాళ్ళూ వుంటారు. అంతకన్నా ఎక్కువ బాధ్యతలు గలవారున్నూ వుంటారు. ఎవరికీ ఏ విధమైన

అభ్యంతరం వుండనట్టే ఉంటుంది. "ఒకసారికి తప్పేమిటి?"అని నీతి, ధైర్యం చెబుతారు.

○ ○ ○

చిన్న జర్క్‌తో బండి ఆగగానే గీతకు మెలకువ వచ్చింది! అరచేతిలో శ్రీకారం చుట్టుకుని వొంటివేపు చూసుకుంది. మొద్దునిద్దర పట్టేసినా సద్దుకో వలసిందేమీ లేకపోవడం చూసుకుని వొళ్లు విరుచుకుంది.

ఏ స్టేషన్లో ఆగిందో తెలుసుకోవాలని కుతూహలం కలిగింది. అక్కడ నుంచి కనబడదు. కిందకూచున్న వాళ్ళు మాట్లాడుకునే ధోరణిని బట్టి, తుని స్టేషను కొద్ది దూరంలో ఉందని అర్థమయింది, టయిమ్ చూసుకుంటే ఆరు దాటి అయిదు నిమిషాలయింది,

ఎదుటి బెర్తులో 'అతని' వేపు చూసింది. నిద్రపోతున్నాడు, రాత్రి చాలా సేపు కబుర్లు చెప్పాడు. ఎంత వద్దనుకున్నా వినక తప్పిందికాదు. కొద్దిగా మాట్లాడకా తప్పింది కాదు. భోన్‌గిర్ స్టేషన్లో బిస్కెట్టు ప్యాకెట్టు పళ్ళు ఆఫర్ చేశాడు. మరో స్టేషనులో డ్రింక్స్ తెప్పించేశాడు. మొహమాట పెట్టేసి బలవంతంగా వాళ్ళో పెట్టేశాడు. భోజనం చేసే బయలుదేరానంటే వినలేదు, భోజనం తరవాత పళ్ళు తినడం, ప్రయాణంలో విటమిన్ల అవశ్యకత అంటూ ఉపన్యాసం చేశాడు. ఎంతో స్నేహం వున్న వాడిలా ఎన్నాళ్ళనుంచో మనసిప్పి మాట్లాడుతున్న వాడిలా తన్నితాను వర్ణించుకుంటూనే తన దేహంలో, కదలి కల్లో, మాటలలో ఎన్నో సోయగాలంటూ పొగడ్తనిపించనంత నేర్పుతో చెప్పాడు. చివరికి పక్క బెర్తుల వాళ్ళు నిదరలోకి జారేక, కిందకూచున్న వాళ్లు కునికి పాట్లలో ఉనికి తెలియనంతగా మునిగి నప్పుడు—అసలు సంగతి బైట పెట్టాడు.... తను విశాఖపట్నంలో శాంతినివాస్‌హోటల్‌లో దిగుతాట్ట. రెండురోజులు- కాదు, రెండు రాత్రులుంటాట్ట. రూము నెంబరు నాలుగు తన కోసం రిజర్వు అయిందిట. అక్కడికి రమ్మన్నాడు. దేనికీ మొహమాట పడక్కర్లేదుట, ఏ పువ్వు లిష్టమో అడిగాడు.ఎందుకో ననుకొని చెబితే గులాబీ లతో గదంతా అలంకరిస్తానని చెప్పాడు. పర్సు ఎదురుగా తెరిచి లెక్క పెట్టాడు. అందులో చిల్లరకాక అయిదువందల రూపాయలున్నాయి. ఇందులో ఏమీ ఇంటికి పట్టుకెళ్ళ నక్కరలేదుట. ఒక రోజుకి రెండేసి వందలు ఖర్చు చేసినా ఏమీ ఫరవాలేదుట.

0 0 0

ప్రతీ పెట్టెలోనూ చూస్తున్నట్టున్నాడు" అనుకుంది గీత అతన్ని చూడ గానే.

తుని స్టేషన్‌లో బండి ఆగిన రెండు నిమిషాలలో, రెండుసార్లు ఆ కంపార్టుమెంటుకి అటూ ఇటూ చూసుకుంటూ తిరిగి, చివరికి అందులో యెక్కి, ఖాళీగా వున్న కార్నర్ సీటులో గీతకు ఎదురుగా చతికిలపడ్డా డతను.

నలభయ్యేళుంటాయి. తెల్లటి దుస్తులు వేసుకున్నాడు. చత్వారపు కళ్ళ జోడు మినహా అతని మొహంమీద అతని వయసును చెప్పేవేవీలేవు, నెత్తి మీద ఒక పాయవెంట్రుకలు నెరిసినా అదేదో బాధని తెలియజేస్తోంది తప్ప వయసునుకాదు.

సిగరెట్టు కాలుస్తున్నా, పేపరు చదువుతున్నా- రైలు ప్రయాణానికి వ్యతి రేకంగా పరుగెడుతున్న చెట్లను గమనిస్తున్నా, ఆ కార్యక్రమాలన్నిటి సందు ల్లోంచీ అతను తననే గమనికగా చూస్తున్నాడని గీతకు అర్థమైంది. ఆ కళ్ళ లోని ఆకళ్ళు ఈ కళ్ళకి కొత్తలేదు, వయసు పెరిగినా బుద్ధిని పెరగనివ్వని జీవప్రవాహ సందేశాలవి.

"మీది హైద్రాబాదు కదండి" అని పలకరించే డతను, హటాత్తుగా.

"అవునండి. మీకెలా తెలుసు?"

"నేను ప్రపంచ తెలుగు మహాసభలకి వొచ్చాను. మనం అంతా ఒకచోట కూర్చుని ప్రోగ్రామ్ చూసేం. ఒకరోజు కాదు. మూడురోజులు వరసగా."

"అలాగాండి. మీ ఫామిలీ మీరూ వొచ్చారా?"

అనుకున్నట్టుగానే, వెంటనే తడబడ్డాడతను.

"లేదండి. నేను ఒక్కణ్ణేవొచ్చాను." అని ఒక అరనిమిషం వూరుకుని "నాకు పెండ్లికాలేదు." అన్నాడతను.

"చవటా!" అనుకుంది గీత, అతని బనియన్‌లోంచి తొంగిచూస్తున్న ఐదుపేటల జంధ్యాలవంక చూస్తూ "మీరు బ్రామిన్సాండి" అంది.

"అవునండి" అన్నాడతను, బుజాల అక్కళింపుతో చాకచక్యంగా జంధ్యాన్ని దాచుకుంటూ.

"మీ దేవూరండి"

"నేను పాయకరావుపేటలో పనిచేస్తున్నాను" అని వెళ్ళిపోయిన వూరి

వేపు వేలు చూపాడు. గబుక్కున పర్స్ తీసి, ఒక విజిటింగ్ కార్డు యిచ్చాడు. కె. వి. సూర్యారావు, బి.ఏ. బ్యాంకులో పని, అదంతా వుంది.

"వైజాగ్ వెడుతున్నారండీ!"

"అవునండి. మీరూ నా?"

"మరేండి. ఏం పనిమీద వెళ్తున్నారో?"

"ఇండియన్ బ్యాంక్‌లో ఇంటర్వ్యూకి రమ్మన్నారండి." అని నిట్టూర్చింది గీత.

"ఇండియన్ బ్యాంకా? శేషగిరిరావని నా ఫ్రెండు ఒకతను హైద్రాబాదు ఇండియన్ బ్యాంకులో ఆఫీసరున్నాడు." అని, కొంచెం సేపాగి "ఎప్పుడండి, ఇంటర్వ్యూ." అన్నాడు.

"ఎల్లుండి."

"చాలా ముందుగా బయల్దేరారే."

"అవునండి. యూనివర్శిటీలో నా ఒరిజినల్ సర్టిఫికెట్సు తీసుకోవాలి. వీలుంటే యెవర్నన్నా ఆశ్రయించి—" అని అతని కళ్ళలోకి చూసి ఆగింది గీత.

అతను ఒక నిమిషం తీక్షణంగా ఆలోచించాడు. "ఐసీ—" అని.

"మీరెక్కడ పుటప్ చేస్తారు?"

గీత పైకి చూసింది.

సరోజ్‌కుమార్ గబుక్కునదూకాడు. "గుడ్ మార్నింగ్. మిస్ గీతా" అని నవ్వుతూ కారిడర్‌లోకి వెళ్ళాడు.

"మీ బంధువులా?"

"కాదండీ. రైల్లో పరిచయమే."

0 0 0

వాల్తేరు స్టేషన్‌లో దిగగానే ముందు గీత. వెనక సరోజ్‌కుమార్, ఆ వెనక సూర్యారావు గేటువైపు నడిచారు. గేటు దాటగానే ఒక ఫుల్‌సూట్‌లో వ్యక్తి సరోజ్‌కుమార్ కెదురువచ్చి "హల్లో" అని కౌగలించుకుని, "కమాన్ స్కూటర్ తెచ్చాను." అంటూ తీసుకుపోబోయాడు.

"వన్ మినిట్—" అని. సరోజ్‌కుమార్ "ఎక్స్‌క్యూజ్ మి-మిస్ గీతా!" అని ఆమెతో ఏకాంతం కోరినట్టు సూచించాడు.

గీత అప్రయత్నంగా ఆగింది.

ఇంచుమించు నిశ్శబ్దంగా అతను "శాంతినివాస్. రూమ్ నెంబరు నాలుగు. ఇవాళ ఖాళీవుండదు. రేపు దయచేయండి. స్వాగతం, గులాబీల పండగ. థాంక్స్" అని జనంలో కలసిపోయాడు.

గీతనిర్ఘాంతపోతూ చూసింది.

కొద్దిదూరంనుంచి సూర్యారావూ చూశాడు. అతనికేమీ అర్థంకాలేదు.

బస్సుకోసం స్టేషన్ దాటి రోడ్డుకొస్తోంది గీత. వెనగ్గా సూర్యారావు వస్తున్నట్టు గమనించింది,

"నేను మీకోసం ట్రైచేస్తాను. ఇవాళ పగలంతా నాకు పనుంది. రాత్రి గాని రేపుగాని వొచ్చి నాకు తెలిసిన వాళ్ళు ఎవరన్నా వున్నారేమో కనుక్కొని మీ ఇంటర్వ్యూ జయప్రదం కావడానికి ఏర్పాటు చేసే పద్ధతి చెప్తాను. మీ రెక్కడుంటారో చెప్పడానికి అభ్యంతరం లేకపోతే చెప్పండి" అన్నాడతను. గీతతో కూడా నడుస్తూ!

గీత అరనిమిషం ఆలోచించింది,

"థాంక్స్. నేను శాంతినివాస్ హోటల్లో రూం నెంబరు నాలుగు రిజర్వు చేసుకున్నాను. రేపు రాత్రికి రండి, నాకు గులాబీ పుష్పాలంటే యిష్టం. మర్చిపోకండి." అని చిరునవ్వు నవ్వుతూ. కదలడానికి సిద్ధంగా వున్న రిక్షాయెక్కి "పోనీవోయ్" అనిచెప్పి, "టాటా" చెప్పింది సూర్యారావుకి.